సాక్షి
అనకాపల్లి
శనివారం । 8 । ఏప్రిల్ । 2023



అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



సింహాచలం: వరాహ లక్ష్మీ నృసింహ స్వామిని శుక్రవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆల యంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి అంతరాలయంలో పూజలు నిర్వహించి, వేద ఆశీర్వచనం అందజే శారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదం, జ్ఞాపిక, శేషవస్త్రాన్ని ఆలయ ఏఈవో ఇజిరోతు శ్రీనివాసరావు న్యాయమూర్తికి అందించారు.



కొత్తకోటలో శిలువతో శాంతి ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

కరుణ కురిసే సజల నయనాలతో..

- శాంతి ప్రదర్శనలు నిర్వహించిన క్రైస్తవులు
- భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

జిల్లాలో గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఏసుక్రీస్తును శిలువ వేసిన ఘట్టాలను కరుణపూరితంగా ప్రదర్శిస్తూ శాంతి ర్యాలీ చేశారు. ఈ ప్రదర్శనలలో వందలాదిమంది మహిళలు, పిల్లలు, చర్చి ఫాదర్లు పాల్గొన్నారు. కొత్తకోటలో ఆర్‌సీఎం చర్చి నిర్వాహకులు గుడ్ ఫ్రైడేను ఘనంగా నిర్వహించారు. 45 రోజులుగా చర్చి సభ్యులు జపమాల నిర్వహిస్తూ వచ్చారు. శుక్రవారం చర్చిలో ప్రత్యేక పూజలు చేశారు. కొత్త కోట బాల ఏసు విచారణ సంఘం ఫాదర్ జాకోబ్ ఆధ్వర్యంలో జరిగిన ప్రదర్శనను అందరూ ఆసక్తిగా తిలకించారు. - రావికమతం

న్యూస్‌రీల్

ధర్నా విరమించిన కొప్పుగొండుపాలెం గ్రామస్తులు

రాంబిల్లి: నేవీ మెయిన్ గేటు వద్ద నిర్వహిస్తున్న ధర్నాను కొప్పుగొండుపాలెం గ్రామస్తులు శుక్ర వారం విరమించారు. రెండు రోజుల క్రితం వాడనర్సాపురం, కొత్తపట్నం గ్రామాలవారు ధర్నాను విరమించిన సంగతి తెలిసిందే. కొప్పుగొండుపాలెం గ్రామస్తులకు జీవనభృతి మంజూరు కాకపోవడంతో ధర్నా కొనసాగించారు. అయితే కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి జీవనభృతి వచ్చేలా చూస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించినట్లు ఈ గ్రామ నాయకులు తెలిపారు.

నేడు వందేభారత్ రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర) : విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ (20833)వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను శనివారం రీషెడ్యూల్ చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఉదయం 5.45గంటలకు బయల్దేరవలసిన వందేభారత్ ఉదయం 8.15గంటలకు బయల్దేరుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. బుధవారం సికింద్రాబాద్ నుంచి విశాఖ వస్తున్న వందేభారత్ రైలుపై ఖమ్మం – విజయవాడ మధ్యలో దుండగులు జరిపిన రాళ్ల దాడిలో సి-8 కోచ్ అద్దాలు దెబ్బతినడం, ఆ కోచ్‌కు సంబంధించిన అద్దాన్ని గురువారం మార్చుచేశారు. ఈ కారణంగా ఈ రైలు గురువారం నుంచి ఆలస్యంగా నడుస్తోంది.

'అనధికారిక ఫుట్‌బాల్ టోర్నీలు తగదు'

విశాఖ స్పోర్ట్స్: విశాఖలో అనధికారికంగా ఫుట్‌బాల్ టోర్నీలు నిర్వహించడం తగదని ఏపీ ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు జి.గోపాలకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీఎఫ్ఏకు క్రీడాప్రాధికార సంస్థ గుర్తింపుతో ఉన్నది వీడీఎఫ్ఏ మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ సంఘం సభ్యులే ఇటీవల అంతర జిల్లాల టోర్నీలు నిర్వహించారన్నారు. అయితే అనధికారికంగా మరో మూడు సంఘాలు విశాఖలో టోర్నీలు నిర్వహిస్తుండడం అనైతికమన్నారు. అసలు జిల్లా సంఘంలో వేరే జిల్లాకు చెందిన వారు ఉండడం ఏమిటని ప్రశ్నించారు. ఎటువంటి అనుమతులు లేకుండా టోర్నీలు నిర్వహిస్తున్నారని, క్రీడాకారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

నేడు విశాఖకు బీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు

సాక్షి, విశాఖపట్నం : భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ మూడు రోజుల పాటు విశాఖలో పర్యటించనున్నారు. శనివారం మధ్యాహ్నం విశాఖపట్నం చేరుకోనున్న తోట ఎయిర్‌పోర్టు నుంచి వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ థియేటర్ వరకూ పార్టీ శ్రేణులతో ర్యాలీగా వెళ్లనున్నారు. అనంతరం అక్కడ ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. 9వ తేదీ ఉదయం ఉత్తరాంధ్ర నాయకులతో భేటీ అయి పార్టీ భవిష్యత్తు కార్యచరణపై చర్చించనున్నారు. అనంతరం రాజమండ్రి వెళతారు. అక్కడ వంగవీటి రంగా విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొననున్నారు. తిరిగి విశాఖ చేరుకుంటారు. 10వ తేదీన ఆర్కే బీచ్ నుంచి స్టీల్‌ప్లాంట్ వరకూ ర్యాలీ నిర్వహించనున్నారు. స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేట్ వద్ద ఉక్కు ఉద్యోగులు, కార్మికులతో సమావేశంలో పాల్గొంటారని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

పలు రైళ్లు రద్దు



తాటిచెట్లపాలెం: ఖరగ్‌పూర్–టాటానగర్ సెక్షన్ పరిధి ఖేమసులి స్టేషన్, అద్ర–చందిలి సెక్షన్ పరిధి కుస్తార్ స్టేషన్‌లో జరుగుతున్న ఆందోళనల కారణంగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేశారు. ఈ మేరకు వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె త్రిపాఠి ఓ ప్రకటన విడుదల చేశారు. ఆందోళనల కారణంగా ఇప్పటివరకు సుమారు 244 రైళ్లు రద్దు చేసినట్లు తెలిపారు. ఈ నెల 8వ తేదీన విల్లుపురం–పురూలియా(22606), తాంబరం–జసిద్ధి(12375), సాయినగర్ షిర్డీ–హౌరా(22893), హౌరా–జగదల్‌పూర్(18005), జగదల్‌పూర్–హౌరా(18006), అలపుజ–ధన్‌బాద్(13352) రైళ్లను రద్దు చేశారు. ఈ నెల 7వ తేదీ(శుక్రవారం) పురులియాలో బయలుదేరాల్సిన పురులియా– విల్లుపురం(22605) ఎక్స్‌ప్రెస్ అద్ర నుంచి బయలుదేరింది.

భవిష్యత్తుకు భరోసా..
– మా నమ్మకం నువ్వే జగనన్నా...

'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం జిల్లాలో పెద్ద ఎత్తున ప్రారంభమైంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో ప్రజలను కలిశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ సర్కారుకు మధ్య తేడాను తెలియజేశారు. వారి అభిప్రాయాలను సైతం అడిగి తెలుసుకున్నారు. ప్రజా మద్దతు పుస్తకంలోని ప్రశ్నలు అడిగి ప్రజల అభిప్రాయాలను నమోదు చేశారు. ఇంటి యజమాని సెల్‌ఫోన్‌తో 8296082960 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇప్పించారు. దేవరాపల్లి మోడల్ కాలనీలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, తుమ్మపాల పంచాయతీ పరిధిలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రజలతో మమేకమయ్యారు. ఇంటి యజమాని సమ్మతితో స్వయంగా మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు.



దేవరాపల్లిలో ఓ ఇంటి వద్ద ప్రజా మద్దతు పుస్తకంలో అభిప్రాయాన్ని నమోదు చేస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు



అనకాపల్లి మండలం తుమ్మపాల పంచాయతీలో రాజపూడి సునీత ఇంటిలో ఐదు ప్రశ్నలకు సమాధానాలు నమోదు చేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

- ఇంటింటికీ వెళ్లిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు
- ఐదు ప్రశ్నలతో పాలనపై ప్రజాభిప్రాయ సేకరణ
- గత ప్రభుత్వానికి, ఇప్పటికీ తేడా వివరించిన నేతలు
- ప్రజల నుంచి నాయకులకు అపూర్వ ఆదరణ
- 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం ప్రారంభం

దేవరాపల్లి/ అనకాపల్లి టౌన్: మా నమ్మకం నువ్వే జగన్ అనేది ప్రజల నినాదమని, అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి పాలన సాగించడంతోనే ప్రజలు అతనిపై విశ్వాసంతో ఉన్నారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. దేవరాపల్లి మోడల్ కాలనీలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. భారీగా హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, కాంగో వాయిద్యాల నడుమ ర్యాలీ నిర్వహించి పండగ వాతావరణంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులతో స్థానిక ప్రజలు రెట్టింపు ఉత్సాహంతో పాల్గొన్నారు.ఈ నెల 20 వరకు 14 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రజలతో మమేకమై చేపట్టాలని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ శ్రేణులకు ముత్యాలనాయుడు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ పరిశీలకుడు ఉరుకూటి అప్పారావు, జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, పార్టీ మండల మహిళ అధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, కోపరేటివ్ డైరెక్టర్ వరదపురెడ్డి లలితానాయుడు, సచివాలయ కన్వీనర్లు గొర్రుపోటు రమాదేవి, కిల్లాడ మౌనిక, ఆతవ మహేష్, బంధం అప్పలరాజు పాల్గొన్నారు.



దేవరాపల్లిలో ర్యాలీలో పాల్గొన్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

పాలనలో తేడా ప్రజలకు వివరించండి

మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అనకాపల్లి మండలం తుమ్మపాల పంచాయతీ పరిధిలో గుండాల జంక్షన్ వద్ద వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి అధ్యక్షతన జరిగిన 'జగనన్నే మా భవిష్యత్తు' సమావేశంలో మాట్లాడారు. పాలనలో టీడీపీ హయాంకు, జగనన్న ప్రభుత్వానికీ ఉన్న తేడాను ప్రజలకు వివరించాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా సేవలందిస్తున్న ముఖ్యమంత్రిని జనం గుండెల నుంచి దూరం చేయడం ఎవరికీ సాధ్యం కాదన్నారు. అమర్‌నాథ్ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజా మద్దతు పుస్తకంలో ప్రశ్నలు అడిగి సమాధానాలు నమోదు చేసుకున్నారు. కుటుంబ యజమాని అనుమతితో 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్‌ను ఇళ్ల గోడలకు మంత్రి అతికించారు. సీఎం పాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారని, ఈ కార్యక్రమాన్ని ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, కశింకోట జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, తుమ్మపాల సర్పంచ్ తట్ట పెంటయ్యనాయుడు, పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి పాల్గొన్నారు.



ఇంటికి 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్‌ను అతికిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అపూర్వం.. మహోత్తరం

- మేలు జరిగితేనే ఓటు వేయమంటున్న దమ్మున్న నాయకుడు జగన్
- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం దేశంలోనే మహోత్తరమని, అధికార పార్టీ ఈ స్థాయిలో ప్రజలతో మమేకవ్వడం ప్రప్రథమమని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. తారువలోని తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు వారాలపాటు జరిగే ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం చేసిన మంచిని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రచారం చేసి వారి అభిప్రాయాలను తీసుకుంటారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 7 లక్షల మంది సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్నారన్నారు. కోటీ 60 లక్షల కుటుంబాలను నేరుగా కలిసి తమ ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తారన్నారు. ప్రజా మద్దతు పుస్తకంలో ప్రజా స్పందనను నమోదు చేసి, ఇంటి యజమాని అంగీకారంతో ఇంటికి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్ అతికిస్తారన్నారు. సెల్‌ఫోన్‌కి సైతం స్టిక్కర్ అతికించి, వారి మొబైల్ నుంచి 8296082960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇప్పించి తద్వారా జగనన్న సందేశం వినిపిస్తారన్నారు. నాలుగేళ్లలో తమ ప్రభుత్వం నుంచి మేలు జరిగిందని నమ్మితేనే తనను మరో మారు ఆశీర్వదించి గెలిపించాలని ధైర్యంగా చెప్పిన దమ్మున్న నాయకుడు జగన్ మాత్రమేనని డిప్యూటీ బూడి ముత్యాలనాయుడు స్పష్టం చేశారు. రాజకీయాలకు, వివక్షకు తావు లేకుండా సంక్షేమ పథకాలను అందించామని, ఈ కారణంగానే ధైర్యంగా ప్రజల మధ్యకు వెళ్తున్నామన్నారు. మూడున్నరేళ్లలో 2 లక్షల కోట్లకు పైగా సొమ్మును సంక్షేమ కార్యాక్రమాల ద్వారా డీబీటీ విధానంలో పేదల ఖాతాల్లో జమ చేశారన్నారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జగనన్న ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతోపాటు అగ్రవర్ణాల పేదలకు సైతం సంక్షేమ పథకాల రూపంలో మేలు చేసి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకుందన్నారు.

జగనన్న శాశ్వత భూ సర్వే వేగవంతం

- ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి ముత్యాలురాజు



సబ్బవరం: కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టితో కలిసి రాళ్లు పాతే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి రేవు ముత్యాలరాజు

మాడుగుల రూరల్/ సబ్బవరం: జగనన్న సమగ్రశాశ్వత భూ రీసర్వేను వేగవంతం చేయాలని, రీసర్వే పూర్తయిన గ్రామాల్లో హద్దు రాళ్ల ఏర్పాటు ప్రక్రియ పక్కాగా చేపట్టాలని ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి రేవు ముత్యాలరాజు ఆదేశించారు. మాడుగుల మండలం వీరనారాయణం, సబ్బవరం మండలం అయ్యన్నపాలెంలో ఆయన కలెక్టర్ రవిపట్టానశెట్టితో కలిసి శుక్రవారం పర్యటించి, సర్వే తీరును, సరిహద్దు రాళ్ల పాతే కార్యక్రమాన్ని పరిశీలించారు. వీరనారాయణంలోని తురుబిల్లి వారి కళ్లాల వద్ద రీ సర్వేను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. మాడుగుల మండలంలో జరుగుతున్న భూముల రీ సర్వే గురించి తహసీల్దారు పి.వి.రత్నం, ఉప తహసీల్దారు పి. సత్యనారాయణలను అడిగి తెలుసుకున్నారు. మొదటిగా భాగవతులు అగ్రహారం గ్రామంలో సర్వే ప్రారంభించినట్లు ఈ సందర్భంగా తెలిపారు. స్థానిక సర్పంచ్ యల్లపు కొండప్పారావు, ఎంపీటీసీ సభ్యురాలు దాడి నూకరత్నం, స్థానిక నాయకులు దాడి మహేష్, పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి విస్సారాపు రామారావు, మాజీ సర్పంచ్ తూరుబిల్లి సత్యంబాబు, పీఏసీఎస్ సీఈవో తూరుబిల్లి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ఇ.శంకర్, స్థానిక వీఆర్వో రవి రాంబాబు, కె.జె.పురం వీఆర్వో కాళింగ రామునాయుడు (పెదబాబు) తదితరులు పాల్గొన్నారు.సబ్బవరం మండలం అయ్యన్నపాలెం గ్రామంలో సమగ్ర రీ సర్వేలో భాగంగా చేపడుతున్న హద్దు రాళ్లు పాతే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి ముత్యాలు రాజు పరిశీలించారు. సర్వే చేస్తున్న గ్రామాల వివరాలను,సర్వే రాళ్లు నాటే విధానాన్ని కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 368 రాళ్లను సరిహద్దు, పోరంబోకు భూముల్లో పాతినట్టు ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. గ్రామంలోని రైతుల కమతాల మధ్య పాతేందుకు అవసరమైన 2,516 రాళ్లను సిద్ధం చేశామని చెప్పారు. విప్పాక అగ్రహారంలో రాళ్లు పాతే కార్యక్రమం ఇప్పటికే పూర్తికాగా, రాయపుర అగ్రహారంలో 574కు గాను 165 రాళ్లను పాతినట్టు వివరించారు. సబ్బవరంలో నిర్వహిస్తున్న సర్వే పట్ల ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి సంతృప్తి వ్యక్తం చేశారు.సర్వే ప్రక్రియ అంతా రైతుల సమక్షంలో నిర్వహించాలని,వారి సందేహాలను నివృత్తి చేస్తూ, సమస్యలను పరిష్కరిస్తూ సర్వే చేపట్టాలని తెలిపారు.ఆయన వెంట ఆర్‌డీవో చిన్నకృష్ణ,మండల సర్వేయర్ శ్రీనివాసరావు, రెవెన్యూ, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

పేపర్ డెవలప్‌మెంట్‌పై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విశాఖపట్నం ఐఐఎం, ఢిల్లీ ఐఐటీ ప్రొఫెసర్లు

దొండపర్తి (విశాఖ దక్షిణ): ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్‌పై అంతర్జాతీయ స్థాయి సదస్సు కోసం ఐఐటీ ఢిల్లీ, ఇండియన్ చాప్టర్ ఆఫ్ ది అసోసియేసన్ ఫర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ (ఐఎస్ఏఐఎస్) సహకారంతో ఐఐఎం విశాఖపట్నం శుక్రవారం ఆంధ్రా యూనివర్సిటీలో పేపర్ డెవలప్‌మెంట్‌పై వర్క్‌షాప్ నిర్వహించింది. ఇందులో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, డిజిటల్ హెల్త్‌కేర్, సైబర్ సెక్యూరిటీ మెటావర్స్, క్వాంటం కంప్యూటింగ్, సస్టైనబిలిటీ.. ఇలా సమకాలీన అంశాలపై ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌కు చెందిన 59 ప్రముఖుల పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఐఐఎం విశాఖపట్నం డీన్ ప్రొఫెసర్ ఎం.వి. అనూరాధ మాట్లాడుతూ విశాఖలో ఐఐఎం కొత్తగా ఏర్పాటైనప్పటికీ మేనేజ్‌మెంట్ విద్యకు సంబంధించి ప్రత్యేక గుర్తింపు సాధించడంలో సఫలీకృతమైనట్లు చెప్పారు. ఐఐటీ ఢిల్లీకి చెందిన ప్రొఫెసర్ అర్పణ్ కర్ మాట్లాడుతూ నాణ్యమైన పరిశోధన పత్రాలను తయారు చేసేందుకు ఉత్తమ అభ్యాసాలను వివరించారు. ఐఎస్ఏఐఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ప్రియా సీతారామన్ తదితరులు పాల్గొన్నారు.

చందనోత్సవ ఏర్పాట్ల పరిశీలన

సింహాచలం: ఈనెల 23న జరిగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవానికి సంబంధించి ట్రాఫిక్ నియంత్రణపై ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం సింహాచలంలో పర్యటించారు. భక్తుల ద్విచక్రవాహనాలు, కార్లను సింహగిరిపైకి అనుమతించకపోతుండటంతో కొండదిగువనే వాటిని పార్క్‌చేసే విధంగా ప్రణాళిక రూపొందించారు. దీనిలో భాగంగా ఆయా పార్కింగ్ ప్రదేశాలను నగర ట్రాఫిక్ ఏడీసీపీ అరీపుల్లా, జోన్–2 ఇన్‌చార్జి ఏసీపీ భీమారావు, గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ కె.అశోక్‌కుమార్, గోపాలపట్నం ఎస్ఐ కె.శ్రీనివాసరావు పలు ప్రాంతాల్లో పర్యటించారు. సింహాచలం దేవస్థానం ట్రాన్స్‌పోర్టు గ్యారేజీ, హవేలీ ప్రాంగణం, తొలిపావంచా వద్ద ప్రదేశాలను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో పార్కింగ్‌కు ఏవిధమైన పనులు చేయాలో పరిశీలించారు.

అప్పన్నకు శ్రీ పుష్పయాగం

- ముగిసిన వార్షిక కల్యాణోత్సవాలు



సింహాచలం: సింహగిరిపై వారం రోజులుగా జరుగుతున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు శుక్రవారం రాత్రితో ఘనంగా ముగిశాయి. కల్యాణోత్సవాల ముగింపు పురస్కరించుకుని సాయంత్రం నుంచి స్వామికి శ్రీ పుష్పయాగాన్ని విశేషంగా నిర్వహించారు. స్వామి కల్యాణ ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు విశేషంగా పూలతో అలంకరించి.. ఆలయ కల్యాణ మండపంలో ఆళ్వారులతో సహా అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. ద్వాదశి ఆరాధన, పలు రకాల పుష్పాలతో పుష్పాంజలి సేవ చేశారు. విశేషంగా హారతులిచ్చారు. అనంతరం భోగమండపంలో ఉంజల్‌సేవ చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు ఈ సేవలను నిర్వహించారు. దేవస్థానం ఈవో త్రినాథరావు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు లేక ఆ'వేద'న!

- సింహాచలం వేద ఆగమ పాఠశాలలో ఇదీ పరిస్థితి
- ఈ పాఠశాల జారీ చేసే సర్టిఫికెట్లకు లభించని ప్రాధాన్యత
- వీటితో అర్చక ఉద్యోగాలకు అర్హత లేకుండా పోతున్న వైనం

సాక్షి, విశాఖపట్నం: తిరుపతి తర్వాత రాష్ట్రంలో సింహాచలం వేద ఆగమ పాఠశాలే పురాతనమైంది. ఎంతో విశిష్టత కలిగిన ఈ పాఠశాలకు చాలా ఏళ్లుగా 'గుర్తింపు' సమస్య వేధిస్తోంది. ఫలితంగా ఇక్కడ వేదాభ్యాసం చేసిన విద్యార్థులకిచ్చే సర్టిఫికెట్లు అక్కరకు రాకుండా పోతున్నాయన్న వేదన మిగులుతోంది. ప్రముఖ దేవస్థానం సింహాచలంలో ఏడు దశాబ్దాల కిందట 1954లో వేద ఆగమ పాఠశాల ఆవిర్భవించింది. అప్పట్నుంచి ఎందరో వేద పండితులను, ఘనాపాఠీలను తయారు చేసిన ఘన చరిత్ర ఈ పాఠశాలకు ఉంది. ఈ పాఠశాలలో వేదాన్ని అభ్యసించిన వారు రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ప్రధానాచార్యులుగాను, ఘనాపాఠీలుగాను వెలుగొందారు. కానీ చాలా ఏళ్ల నుంచి ఇక్కడ విద్యార్థులకిచ్చే సర్టిఫికెట్లకు ప్రాధాన్యత లేకుండా పోయింది. అంతకు ముందు వరకు ఈ సర్టిఫికెట్లకు ఎంతో ప్రాధాన్యత ఉండేది. సుమారు 30 ఏళ్ల క్రితం దేవదాయ శాఖ అర్చక పరీక్షలు నిర్వహించడం మొదలు పెట్టినప్పట్నుంచి గుర్తింపు పొందిన వేద ఆగమ పాఠశాలల సర్టిఫికెట్లు పొందిన వారికే ఆ పోస్టుల్లో నియామకాలకు అనుమతిచ్చింది. సింహాచలం వేద ఆగమ పాఠశాలకు గుర్తింపు లేకపోవడంతో ఈ పాఠశాలలో అభ్యసించిన వారు దేవదాయ శాఖ అర్చక ఉద్యోగాలకు అర్హత పొందలేకపోతున్నారు. అంతేకాదు.. విదేశాల్లో అర్చకత్వం కోసం వెళ్లాలనుకున్న వారికీ ఈ సర్టిఫికెట్లు చెల్లుబాటు కావడం లేదు. దీంతో ఇలాంటి ఉద్యోగాల్లో చేరాలనుకున్న వారు, విదేశాలకు వెళ్లాలనుకున్న వారు ఈ పాఠశాలలో వేద ఆగమ శాస్త్రాలను అభ్యసించినప్పటికీ గుర్తింపు పొందిన మరో ప్రైవేటు వేద పాఠశాలలో మళ్లీ కోర్సును పూర్తి చేయాల్సి వస్తోంది. అలా ప్రైవేటు వేద పాఠశాలలో కోర్సు చేసి, సర్టిఫికెట్లను సమర్పించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది సింహాచలం వేద ఆగమ పాఠశాలలో అభ్యసించే విద్యార్థులకు ఇబ్బందికరంగా పరిణమిస్తోంది. దీనిపై ఈ వేద పాఠశాలకు గుర్తింపునివ్వాలని కోరుతూ గత ప్రభుత్వాల హయాంలో ప్రిన్సిపాళ్లు, మరికొందరు దేవదాయశాఖ కమిషనర్లకు లేఖలు రాశారు. కానీ ఈ పాఠశాల గుర్తింపునకు నోచుకోలేదు. దీంతో ఈ వేద ఆగమ పాఠశాలలో అభ్యసించిన వారి సర్టిఫికెట్లు ఉద్యోగాలకు, విదేశాలకు వెళ్లేందుకు అక్కరకు రావడం లేదన్న భావనలో ఉంటున్నారు. ఫలితంగా ఈ వేద ఆగమ పాఠశాలకు బదులు ఇతర ప్రాంతాల్లో గుర్తింపు పొందిన వేద పాఠశాలల్లో చేరుతున్నారని, దీంతో ఈ పాఠశాలలో చేరే వారి సంఖ్య తగ్గిపోతోందని అంటున్నారు.



సింహాచలంలోని వేద ఆగమ పాఠశాల

వేద కోర్సులివీ..

సింహాచలం వేద ఆగమ పాఠశాలలో పాంచరాత్ర ఆగమం (వైష్ణవ), శైవాగమం, స్మార్తం, రుగ్వేద, యజుర్వేద, సామవేద, అధర్వణ వేద విభాగాలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో వేదం 12, ఆగమం 8, స్మార్తం 5 ఏళ్లు చొప్పున కోర్సులు ఉంటాయి. రాష్ట్రంలోని దాదాపు 10 జిల్లాల నుంచి విద్యార్థులు ఇక్కడ వేద విద్య అభ్యాసానికి వస్తుంటారు. ఇతర ప్రైవేటు వేద పాఠశాలలకు ఇస్తున్న మాదిరిగానే సింహాచలం వేద ఆగమ పాఠశాలకు కూడా గుర్తింపు ఇవ్వాలని, దీంతో తమ పిల్లల భవిష్యత్తుకు ఆ సర్టిఫికెట్లు పనికొస్తాయని వేద విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి



రుత్తల చినతల్లి మృతదేహం

యలమంచిలి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ మహిళ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్టు యలమంచిలి రూరల్ ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. మండలంలో పురుషోత్తపురం గ్రామానికి చెందిన రుత్తల చినతల్లి (49)పొలం పనులు ముగించుకుని ఇంటికి వెళ్లే క్రమంలో గురువారం జాతీయ రహదారి దాటుతుండగా తుని నుంచి యలమంచిలి వైపు వస్తున్న బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో చినతల్లి తీవ్రంగా గాయపడినట్టు ఎస్ఐ చెప్పారు.ఆమెను కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన చెప్పారు

జిల్లాలోని 424 గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టరు



ప్రపంచ ఆరోగ్య దినోత్సవ బ్యానర్ ప్రదర్శిస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్

లంకవానిపాలెం పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో హేమంత్ ఆకస్మికంగా తనిఖీ

కె.కోటపాడు: సృష్టిలో మానవజన్మ గొప్పదని, అందుకే ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి హేమంత్ సూచించారు. మండలంలోని లంకవానిపాలెం పీహెచ్‌సీ శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఇక్కడ ప్రధాన వైద్యాధికారి శైలజపై ఇటీవల వైద్య సిబ్బంది ఫిర్యాదు చేసిన నేపథ్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఆయన మాట్లాడారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. నాడు-నేడు నిధులతో చేపట్టిన భవనాన్ని పరిశీలించి పనులు వేగవంతం చేయాలని నిర్మాణదారులను ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలోని 424 గ్రామాల్లో ప్రజలకు ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా గ్రామాల్లో ప్రజల అనారోగ్య సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి మెరుగైన వైద్యం అందించడం వీలవుతుందన్నారు. ఇందులో భాగంగా 67 రకాల వ్యాధులకు వైద్యంతోపాటు మందులు అందుబాటులో ఉంటాయన్నారు. 14 రకాల పరీక్షలు చేయనున్నట్లు వివరించారు. జిల్లాలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో 24 గంటల పాటు ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంల ద్వారా వైద్యం అందుబాటులో ఉండనుందన్నారు. వీటి ద్వారా అత్యవసరమైన వారికి టెలీమెడిసిన్ లేదా పీహెచ్‌సీ వైద్యాధికారి ద్వారా వైద్యం అందనున్నట్లు వివరించారు. అనంతరం ప్రపంచ ఆరోగ్య దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. మనిషి పని చేయాలంటే ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. మంచి ఆరోగ్యానికి ఆహారపు అలవాట్లు ముఖ్యమని వివరించారు. వైద్యాధికారులు శైలజ, జాహ్నవి, హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు, పి.త్రినాథ్, ఆర్.గంగాధర్ పాల్గొన్నారు.

దేశంలోనే అత్యధిక సంక్షేమ పథకాలు



'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కరణం ధర్మశ్రీ

ఆ ఘనత వైఎస్సార్‌సీపీదే : ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: దేశంలోనే అత్యధిక సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందని, దీన్ని గుర్తించి ప్రజలు మరింత మద్దతు పలకాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కోరారు. 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం కరపత్రాలను చోడవరం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 20వ తేదీ వరకు పార్టీ గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, నాయకులుంతా కలిసి ప్రజల్లోకి వెళ్లాలన్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి ఆ కుటుంబానికి ప్రభుత్వం అందించిన పథకాలు, సీఎం జగన్ సుపరిపాలనపై అడిగి తెలుసుకోవాలన్నారు. గత ప్రభుత్వాల పనితీరుకు, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పనితీరును బేరీజు చేస్తూ సమగ్రంగా వివరించాలని సూచించారు. సచివాలయాల పరిధిలో క్లస్టర్ల వారీగా ప్రతీ ఇంటికి వెళ్లాలని కోరారు. గత ఎన్నికల ముందు పాదయాత్రతోపాటు మేనిఫెస్టోలో పొందుపరిచిన అన్ని హామీలను నాలుగేళ్లలోనే నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని స్పష్టం చేశారు. ప్రతీ కుటుంబానికి వందశాతం అర్హతను బట్టి సంక్షేమ పథకాలు ఇవ్వాలన్నదే సీఎం ఆశయమన్నారు. అనంతరం చోడ వరం మండలం తిమ్మన్నపాలెంలో జరిగిన 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు వివరించారు. ఏఎంసీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంపలి ఆనందీశ్వరరావు, బొడ్డేడ సూర్యనారాయణ, దన్నిన వెంకట్రావు, పట్టణాధ్యక్షుడు దేవరపల్లి సత్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా సింహాచలంనాయుడు మృతి కేసు విచారణ

- ఇప్పటికే 25 మంది సాక్షులను విచారించాం
- సాక్ష్యాధారాలు ఉంటే అందజేయాలి
- అనకాపల్లి ఇన్‌చార్జ్ డీఎస్పీ మహేశ్వరరావు



విలేకరుతో మాట్లాడుతున్న డీఎస్పీ మహేశ్వరరావు, సీఐ తాతారావు, ఎస్ఐ నాగేంద్ర

దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లికి చెందిన ట్రాక్టర్ యజమాని జామి సింహాచలంనాయుడు మృతి కేసు విచారణ నిష్పక్షపాతంగా జరుగుతోందని అనకాపల్లి ఇన్‌చార్జి డీఎస్పీ ఎం.మహేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఎస్.తాతారావు, ఎస్ఐ డి.నాగేంద్రతో కలిసి శుక్రవారం వెల్లడించారు.

ఈ ఏడాది మార్చి 19న గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరివేసుకుని అనుమానాస్పద స్థితిలో సింహాచలంనాయుడు మృతి చెందిన సంగతి విదితమే. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో ఇప్పటి వరకు 25 మంది సాక్షులను విచారించామన్నారు. ఫోన్ కాల్ డేటా ఆధారంగా కూడా అన్ని కోణాల్లో సమగ్ర విచారణ జరుగుతోందని చెప్పారు. ప్రేమించిన అమ్మాయి తనకు దూరం అవుతుందనే మనస్తాపంతో ఉరి వేసుకొని మృతి చెందినట్టు తమకు లభించిన సాక్ష్యాధారాల మేరకు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చామని తెలిపారు. అయితే ఈ కేసు విచారణ ఇంకా కొనసాగుతోందన్నారు.

ఈ మృతిపై ఎటువంటి అనుమానాలున్నా తెలియజేయాలని, అందుకు సంబంధించిన సాక్ష్యాధారాలుంటే తమ పోలీస్‌స్టేషన్, సర్కిల్ ఆఫీస్‌లో సమర్పిస్తే ఆ కోణంలో కూడా బహిరంగంగా విచారణ చేపడతామని డీఎస్పీ మహేశ్వరరావు స్పష్టం చేశారు. పోలీసుల ఆత్మ స్థైర్యం దెబ్బతినేలా, అసభ్యకర పదజాలంతో ఈ విషయమై సోషల్ మీడియాలో పోస్టులు పెడితే అటువంటి వారిపై కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ హెచ్చరించారు.

ప్రేమ విఫలమై.. ఒడిశా కూలీ ఆత్మహత్య

కశింకోటలో ఇటుక బట్టీ పనులకు వచ్చి అఘాయిత్యం



చెట్టుకు ఉరేసుకుని వేలాడుతున్న ఒడిశా కూలీ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కశింకోట: ప్రేమలో విఫలమైన ఒడిశా కూలీ మనస్తాపంతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన కశింకోటలోని శారదానది అవతల ఇటుకల బట్టీ ప్రాంతంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ ఎ. ఆదినారాయణరెడ్డి వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని కోర్లమాల్ గ్రామానికి చెందిన గోవర్ధన్‌బాగ్ (21) మూడు నెలల క్రితం అక్కడి అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకోవడానికి ప్రయత్నించగా, అందుకామె నిరాకరించింది. దాంతో కశింకోటలోని శారదానది అవతల ఇటుకల బట్టీలో పని చేయడానికి ఒడిశా నుంచి వచ్చి నెల రోజుల తర్వాత తిరిగి తన స్వగ్రామానికి వెళ్లాడు. అక్కడ మళ్లీ ప్రేమికురాలితో ప్రేమను సఫలీకృతం చేసుకోవడానికి విశ్వప్రయత్నం చేసినా ఫలించలేదు. ఈ క్రమంలో తల్లిదండ్రులు నచ్చచెప్పడంతో మళ్లీ కశింకోట ఇటుకల బట్టీలో పనికి ఇటీవల వచ్చాడు. అప్పటి నుంచీ ప్రేమికురాలిపై ధ్యాస పోలేదు. సెల్ ఫోన్ ద్వారా ప్రయత్నించినప్పటికీ ఆమె నుంచి స్పందన కరవైంది. దీంతో తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని తండ్రి చమురుబాగ్‌కు ఫోన్లో గురువారం రాత్రి సమాచారం అందించాడు. అనంతరం బట్టీ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం స్థానికులు, ఇటుకల బట్టీ యజమాని పి. చంద్రశేఖర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రపంచ రికార్డు గ్రహీతకు మంత్రి అభినందన



ఇషితను అభినందిస్తున్న ఐటీ శాఖ మంత్రి అమర్‌నాథ్

ఎస్.రాయవరం: తైక్వాండోలో ప్రపంచ రికార్డును సొంతం చేసుకున్న ఎస్.రాయవరం మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన నానబోయిన ఇషితను పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అభినందించారు. గాజువాక మిందిలో శుక్రవారం ఇషిత తన కుటుంబ సభ్యులతో మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో ప్రతిభ కనబరిచిన ఇషిత రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకొచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఏడున్నరేళ్ల వయసులోనే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 22 పతకాలు సాధించి ప్రపంచ స్థాయి రికార్డు సృష్టించిందని కోచ్ ఎస్.యశోదరావు తెలిపారు.

భవనంపై నుంచి పడి కార్మికుడి మృతి

రాంబిల్లి: సెజ్‌లో వసుధ ఫార్మా కంపెనీలో శుక్రవారం భవనంపై నుంచి పడి తిరుమల రాజు వెంకట సుబ్బరాజు(32) అనే కార్మికుడు మృతి చెందినట్టు ఎస్ఐ దీనబంధు తెలిపారు. నక్కపల్లి మండలం వేంపాడు గ్రామానికి చెందిన వెంకట సుబ్బరాజు కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడని తెలిపారు. భవనంపై గల రేకుల షెడ్డు వర్షానికి కారిపోతుండడంతో తారు అంటించేందుకు సుబ్బరాజు ప్రయత్నిస్తుండగా రేకులు విరిగిపోవడంతో 50 అడుగులపై నుంచి గ్రానైట్ ఫ్లోరింగ్ పై పడ్డాడు. దీంతో తలకు గాయమైనట్టు ఎస్ఐ చెప్పారు.అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్టు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు. మృతుడికి 3 నెలల క్రితం వివాహం అయింది. భార్య, తల్లి,తండ్రి తమ్ముడు ఉన్నారు. వీరిది వ్యవసాయ కూలి కుటుంబం.

విశాఖ వెళ్లి పింఛన్ల అందజేత



విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చీడికాడ మండలం జైతవరం గ్రామానికి చెందిన చెల్లెఅప్పారావుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ చిన్నారి



బుచ్చెయ్యపేట మండలం వడ్డాదికి చెందిన కూర్మాకుల మోహనరావుకు కేజీహెచ్‌లో పింఛన్ నగదు అందిస్తున్న వలంటీర్ ప్రసాద్



రావికమతం మండలం గర్నికం గ్రామానికి చెందిన చెవ్వేటి సూరిబాబుకు విశాఖ కేజీహెచ్‌లో పింఛన్ అందిస్తున్న వలంటీరు టి.ఎస్.వి. సతీష్


మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య



శ్రీదేవి మృతదేహం

రోలుగుంట: మండలంలో కొమరవోలు గ్రామానికి చెందిన వివాహిత శుక్రవారం తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై నాగ కార్తీక్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఇర్లే రాముతో మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంకు చెందిన శ్రీదేవితో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. వీరికి ఏడు నెలల పాప ఉంది. భర్త రాము జీవనోపాధి కోసం ఒడిశా వెళ్లి ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో మూణ్నెల్లుగా ఆమెను దూరం పెడుతున్నాడు. పాప పుట్టిన తర్వాత ఇంటికి రాలేదు. వీటికి ఆర్థిక ఇబ్బందులు తోడవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుంది. స్థానికుల సమాచారంతో ఎస్సై సంఘటన స్థలాన్ని పరిశీలించారు. శవ పంచనామా నిర్వహించి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పూరిల్లు దగ్ధం- రూ.లక్ష ఆస్తినష్టం



బాధిత కుటుంబానికి సాయం అందిస్తున్న దృశ్యం

కూనవరం: మండల పరిధిలోని పంద్రాజుపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో ఓ పూరిల్లు దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం ఇంటి యజమాని పొడియం రామారావు తన భార్య ప్రసవించడంతో నాలుగు రోజుల నుంచి కోతులగుట్ట ప్రభుత్వ ఆస్పత్రిలో ఉంటున్నాడు. శుక్రవారం ఆకస్మికంగా ఇంట్లో పెద్ద ఎత్తున పొగ, మంటలు రావడంతో స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. అప్పటికే ఇంట్లో సామగ్రి కాలిబూడిదైంది. రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. చినార్కూరు సర్పంచ్ సున్నం అభిరామ్, ఎంపీపీ పాయం రంగమ్మ,ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి, అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆర్ఐ విగ్నేష్, వీఆర్వో ధర్మరాజు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు తక్షణ సహాయం కింద 25 కిలోల బియ్యం, నిత్యావసర సరకులు అందజేశారు.

ఎంపీపీపై దాడిచేసిన ఘటనపై డీఎస్పీ విచారణ



ఘటన జరిగిన ప్రాంతాలను పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రవీణ్‌కుమార్

నక్కపల్లి: బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఈ నెల 5వ తేదీ బుధవారం నక్కపల్లి ఎంపీపీ ఏనుగుపల్లి రత్నంపై జరిగిన దాడి ఘటనకు సంబంధించి నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం విచారణ నిర్వహించారు. స్థానిక ఎస్ఐ శిరీషతో కలసి ఆయన బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం, సభావేదిక ఏర్పాటు చేసిన ప్రాంతాలను పరిశీలించారు. ఆ రోజు చోటు చేసుకున్న ఘటనలు, ఘర్షణకు దారితీసిన కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. దళిత మహిళ అయిన తనపై యలమంచిలి తాతబాబు, శీరం నర్సింహమూర్తి, కొర్ని రాజారమేష్‌లు దాడి చేసి గాయపరిచారంటూ ఎంపీపీ రత్నం పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వాలని ఆమెకోరారు. పోలీసులు ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వడంలో తాత్సారం చేయడంతో ఆమె ఉదయం 11 గంటలనుంచి రాత్రి 9 గంటల వరకు దళితులతోకలసి పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించి, జాతీయరహదారిపై బైఠాయించారు. ఎట్టకేలకు రాత్రి 9 గంటలకు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి కాపీ ఎంపీపీకి ఇచ్చారు. దీనిపై శుక్రవారం డీఎస్పీ విచారణ నిర్వహించారు.

సింహాచలేశుడి ఉంగరం చోరీ చేస్తారా?

- సింహగిరిపై పలువురు భక్తులను ప్రశ్నించిన అర్చకులు
- మేం ఉంగరం దొంగిలించలేదంటూ కన్నీటిపర్యంతం
- నవ్వుల నందడిగా సాగిన వినోదోత్సవం



దొరికిన ఉంగాన్ని చూపిస్తున్న పురోహిత్ అలంకారి సీతారామాచార్యులు

సింహాచలం: సింహాద్రి అప్పన్న స్వామివారి దర్శనానికి వచ్చి ఆయన ఉంగరాన్నే దొంగిలిస్తారా.? అదేం పని.. మర్యాదగా చోరీ చేసిన ఉంగరాన్ని ఇచ్చేయండి.. లేదంటే పోలీసులకు అప్పగిస్తాం.. అంటూ సింహగిరికి వచ్చిన పలువురు భక్తులను దేవస్థానం స్థానాచార్యులు ప్రశ్నించేసరికి అంతా కంగుతిన్నారు.

మేం దొంగల్లా కనిపిస్తున్నామా?.. స్వామివారి దర్శనానికి వస్తే ఉంగరాన్ని దొంగతనం చేశారంటారేంటి? పైగా తాళ్లతో బంధిస్తారా? అంటూ భక్తులు ఆవేశంతో స్థానాచార్యులను ఎదురు ప్రశ్నించారు.

చూడండీ.. మీరు దొంగతనం చేసినట్లు మా దగ్గర ఆధారాలున్నాయి. మీరు ఉంగరాన్ని తీసిన దృశ్యం సీసీ కెమెరాల్లో రికార్డ్ అయింది. పోలీసులు రాకముందే ఉంగరాన్ని మర్యాదగా ఇచ్చేయండి.. అంటూ స్థానాచార్యులు మరింత గద్దించి అడగడంతో భక్తులు కన్నీటిపర్యంతమయ్యారు.

ఇదీ.. సింహగిరిపై శుక్రవారం నవ్వుల సందడిగా సాగిన శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి వారి వినోదోత్సవం. చివరికి ఇదంతా వినోదోత్సవంలోని ఘట్టమని తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు. తమకు మాత్రమే దక్కిన భాగ్యంగా భావించి ఆనందభరితులయ్యారు.

ఈ నెల ఒకటో తేదీ నుంచి వారం రోజుల పాటు జరుగుతున్న స్వామివారి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా గత గురువారం రాత్రి జరిగిన మృగయోత్సవంలో పోయిన స్వామివారి ఉంగరాన్ని వెతికే ఘట్టాన్ని శుక్రవారం ఉదయం వినోదోత్సవంగా నిర్వహించారు. ఏడు పరదాల్లో దాగున్న స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని రాజగోపురం వద్ద పల్లకిలో ఆశీనింపజేశారు. స్వామివారి దూతగా పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు కర్ర పట్టుకుని దర్శనానికి వచ్చిన పలువురు భక్తులను ఉంగరం దొంగిలించారంటూ తాళ్లతో బంధించి రాజగోపురం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ స్థానాచార్యుడు టి.పి.రాజగోపాల్ వారిపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఉత్సవం గురించి తెలియని వాళ్లు కన్నీటిపర్యంతం కాగా.. తెలిసిన భక్తులు నవ్వుతూ సమాధానం చెప్పారు. స్వామిపై ఉన్న ఒక్కో పరదా తొలగించగా.. చివరి పరదాలో ఉంగరం దొరికింది. విద్యార్థులతోపాటు పలువురు భక్తులు ఈ వేడుకలో భాగస్వాములయ్యారు.

క్లుప్తంగా

గడప గడపకు మన ప్రభుత్వం నేడు

అనకాపల్లిటౌన్ : మండలంలోని తుమ్మపాల పంచాయతీ సచివాలయం–3 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం ఉదయం 8 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆరోగ్య సూత్రాలపై అవగాహన

అనకాపల్లిటౌన్ : మండలంలోని కోడూరు ధాత్రి ఆయుర్వేదిక్ పరిశోధనా సంస్థలో సూక్ష్మ వ్యాయామం, క్లిష్టమైన ఆసనాలపై శిక్షణ శుక్రవారం ప్రారంభమయింది. ఈ సందర్భంగా ఆరోగ్యధాత్రి చీఫ్ ఫిజీషియన్ సుందరరాజ్ పెరుమాళ్ ఆధ్వర్యంలో పలు ఆసనాలు వేయించారు. ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

'యాదవ' కార్యదర్శిగా ఏసు

కశింకోట : జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి మండల కార్యదర్శిగా కర్రి ఏసు నియమితులయ్యారు. పరవాడపాలెం గ్రామానికి చెందిన ఏసును సమితి జిల్లా అధ్యక్షుడు వియ్యపు భూలోకనాయుడు నియమించారు. ఈ మేరకు శుక్రవారం నియామక పత్రం అందించారు.

నిత్యం నడకతో ఆరోగ్యం



వాకర్స్ సమావేశంలో మాట్లాడుతున్న వైద్యుడు నాయుడు

అనకాపల్లిటౌన్ : నిత్యం నడక వల్ల శరీరంలో రక్త ప్రసరణ పెరిగి, నాడీ వ్యవస్థ మెరుగుపడి ఆరోగ్యంగా జీవించవచ్చని వైద్యుడు డి.డి.నాయుడు అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఎన్టీఆర్ బెల్లం మార్కెట్‌యార్డ్ వాకర్స్, అనకాపల్లి వాకర్స్ క్లబ్, ఎన్టీఆర్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం బెల్లంమార్కెట్ ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యం నడకతో గుండె సమస్యలు, పక్షవాతం, సుగర్, కీళ్ల నొప్పులు, అధిక బరువు సమస్య నుంచి విముక్తి పొందవచ్చన్నారు. శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పోయి మంచి కొలెస్ట్రాల్ పెరగడానికి నడక ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో వాకర్స్ యల్లపు శివ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 3,780 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,090	4,280
మొదటి రకం	3,990	4,150
రెండో రకం	3,400	4,030
మూడో రకం	3,280	3,390

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 60 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–1 యూనిట్, ఏ నెగిటివ్–1 యూనిట్, బీ పాజిటివ్–25 యూనిట్లు, బీ నెగిటివ్–1 యూనిట్, ఓ పాజిటివ్–32 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 358 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 294 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

అనకాపల్లి సినిమాలు

మీటర్	రాజా
రంగమార్తాండ	సత్యనారాయణస్క్రీన్–1
డూంజియన్స్ అండ్ డ్రాగన్స్	సత్యనారాయణస్క్రీన్–2
రావణాసుర	షిర్డిసాయి
దసరా	షిర్డిసాయి
భూతవైద్యుడు దిపోప్స్ ఎక్సర్సిస్ట్	వెంకటేశ్వర
రావణాసుర	శ్రీసత్య
దాస్ కా ధమ్కీ	రామచంద్ర

మట్టి కుండ.. నువ్వు సల్లగుండ

అనలే వేసవి. ఉష్ణతాపం పెరుగుతోంది. తీరని దప్పిక. అలాంటప్పుడు చల్లని నీరు తాగితే ఆ తృప్తే వేరు. ఫ్రిడ్జ్‌ల్లో ఉంచిన నీటి కంటే మట్టి కుండల్లో నీరు ఆరోగ్యానికి శ్రేయస్కరమని వైద్యుల సూచన. దీంతో మట్టి కుండలు, కూజాల్లో ఉంచిన నీటిని తాగేందుకే ప్రజలు ప్రాధాన్యమిస్తున్నారు. ఈ నేపథ్యంలో మట్టి కుండలకు గిరాకీ పెరుగుతోంది.

- సామాన్యుడి ఫ్రిడ్జ్‌కు పెరిగిన గిరాకీ
- చల్లని నీరు.. ఆరోగ్యం చెడనీయదు
- వేసవిలో ఊపందుకున్న వ్యాపారం



అమ్మకానికి సిద్ధంగా ఉన్న మట్టి పాత్రలు



మట్టిపాత్రలను తయారు చేయడంలో నిమగ్నమైన కుమ్మరి

అనకాపల్లి రూరల్ : నాడు మట్టి కుండలు లేని ఇళ్లు ఉండేవి కావు. అధునికత మోజులో ప్రజలు వీటికి స్వస్తి పలికారు. ప్రతి ఇంట్లో స్టీల్ పాత్రలు, ప్లాస్టిక్ క్యాన్లు, ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం పెరిగింది. కోవిడ్ అనంతర పరిస్థితులతో ఆరోగ్యంపై ప్రజల్లో స్పృహ పెరిగింది. వద్దనుకున్న దారి వేపే తిరిగి చూస్తున్నారు. వేసవిలో ఆరోగ్యం దృష్ట్యా మట్టి కుండల వినియోగానికే మొగ్గు చూపుతున్నారు. దీంతో మట్టి పాత్రలు, కుండలు, కూజాలు తదితర వస్తువులకు డిమాండ్ పెరిగింది.

ఊపందుకున్న వ్యాపారం

కొద్ది రోజులుగా భానుడి ప్రతాపంతో అనకాపల్లి పట్టణం, పరిసర ప్రాంతాల్లో మట్టి కుండల విక్రయాలు ఊపందుకున్నాయి. దీంతో పాటు జిల్లాలో పలు ప్రాంతాల్లో వేసవి చలివేంద్రాల వద్ద మట్టి కుండల ఏర్పాటుకోసం వీటిని కొనుగోలు చేస్తున్నారు. ట్యాప్‌లతో కూడిన కుండలు, కూజాల కొనుగోలుకు జనం మక్కువ చూపుతున్నారు. అనకాపల్లి పట్టణం సహా పలు చోట్ల వారపు సంతల్లో మట్టి కుండలు వివిధ ఆకృతుల్లో కొనుగోలుదారుల్ని ఆకట్టుకుంటున్నాయి. విక్రయాలు పెరగడంతో వీటి తయారీదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆధునిక హంగులు

మట్టి పాత్రల తయారీదారులు వినియోగదారులను ఆకర్షించడానికి వివిధ రకాల ఆకృతుల్లో వాటిని తయారు చేస్తున్నారు. ప్రజల అవసరాలను బట్టి మట్టిపాత్రలకే ఆధునిక హంగులద్ది రహదారుల పక్కన అమ్మకానికి ఉంచుతున్నారు. వీటిని చూసిన వెంటనే పలువురు కొనుగోలు చేస్తున్నారు. ఈ సీజన్లో ముఖ్యంగా కుండలు, కూజాలకు ఆదరణ పెరగడంతో మార్కెట్‌లోకి వివిధ రకాల ఆకృతులలో వచ్చి చేరాయి. ప్రజలు కూడా వాటిని ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారులు ఒక్కో కుండను సైజును బట్టి రూ.100 నుంచి రూ.600 వరకు విక్రయిస్తున్నారు. అనకాపల్లి పట్టణం నుంచి తుమ్మపాల వెళ్లే రహదారి పక్కన గుండాల కూడలితో పాటు పలు చోట్ల ప్రధాన రహదారుల పక్కన కుండలు, కూజాలు తయారీతో పలువురు కుమ్మర్లు ఉపాధి పొందుతున్నారు.

విక్రయాలు బాగున్నాయి



మట్టి పాత్రల తయారీనే మా వృత్తి. దశాబ్దాల నుంచి వీటిపైనే ఆధారపడి బతుకుతున్నాం. ప్రస్తుతం మట్టి కుండలకు మళ్లీ ఆదరణ పెరిగింది. వేసవి సీజన్‌లో చలివేంద్రాలకు అవసరమైన పెద్ద సైజు కుండలకు గిరాకీ ఉంటోంది. మట్టి కుండలో నీరు తాగడం ఆరోగ్యకరం. కుండ ఉంటే ఫ్రిడ్జ్, ఫిల్టర్ రెండూ కొనుగోలు చేసినట్టే. కుళాయిలు ఉన్న కూజాలు, కుండలనే ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.

– మునగపాక రామలక్ష్మి, గుండాల వీధి, అనకాపల్లి

మట్టి తెచ్చుకునే అవకాశమివ్వాలి



పాత్రల తయారీకి అవసరమైన మట్టిని చెరువుల్లోంచి తెచ్చుకునేందుకు కుమ్మరులకు అవకాశం ఇవ్వాలి. ట్రాక్టర్ మట్టికి రూ.8 వేలు నుంచి రూ.10 వేలు ఖర్చవుతోంది. మట్టి తెచ్చుకోవడానికి అధికారులు, పోలీసుల ఆంక్షలు పెరిగిపోవడంతో కుల వృత్తి అంతరించిపోయే ప్రమాదం ఏర్పడింది. కుమ్మరులకు ప్రభుత్వం ప్రోత్సాహమివ్వాలి. మట్టితో అలంకరణ వస్తువులూ తయారుచేయొచ్చు.

– దేవారపు ఈశ్వరరావు, తయారీదారు, అనకాపల్లి

పండగలా 'మా నమ్మకం నువ్వే జగన్'



గవరపాలెం పల్లపువీధి ఇంటి గోడకు స్టిక్కర్లు అతికిస్తున్న కొణతాల నీలిమ, భాస్కర్ దంపతులు



ఉగ్గినపాలెంలో వృద్ధురాలికి కరపత్రం అందిస్తున్న స్థానిక నాయకులు



తాళ్లపాలెంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంపై లగిశెట్టి గణేష్ ఇంటింటి ప్రచారం


అనకాపల్లిటౌన్ : గత పాలనకు, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ఉన్న తేడాను గమనించాలని 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ అన్నారు. గవరపాలెం వల్లపువీధిలో శుక్రవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఓ పండగలా నిర్వహించారు. 19వ సచివాలయ పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గృహ యజమానుల అనుమతితో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రంతో కూడిన మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను గోడలకు అతికించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జి కొణతాల భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ నేతలు ఆళ్ల సంతోష్, కాండ్రేగుల శ్రీరాం, పెంటకోట సన్యాసినాయుడు, దాడి కృష్ణ, మహేష్, దాడి త్రినాథ్, పెట్ల పరదేశినాయుడు, సూరిశెట్టి గణేష్, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

83వ వార్డులో మా నమ్మకం నువ్వే జగన్


- పట్టణంలోని లక్ష్మీదేవిపేట సచివాలయం–5 పరిధిలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 83వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు జాజుల ప్రసన్నలక్ష్మి హాజరై, ప్రతి ఇంటికీ వెళ్లి మా నమ్మకం నువ్వే జగన్‌లో భాగంగా ఐదు ప్రశ్నలను గృహ యజమానులకు అడిగి, వాటికి వారిచ్చిన సమాధానాలు రాసుకున్నారు. తాము మాట్లాడిన ప్రతి గృహస్తుని ఇంటికి స్టిక్కర్లు అతికించి, కరపత్రాలు పంపిణీ చేస్తూ, 8296082960 నంబర్‌కు ఫోన్ చేయించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ మూడు రోజుల క్రితం వైఎస్సార్ ఆసరా పడిందని, మరో నాలుగు సంక్షేమ పథకాలు అందాయని కార్పొరేటర్ వద్ద తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పట్టణ మహిళా అధ్యక్షురాలు ఎ.వి.రత్నకుమారి, పార్టీ సీనియర్ నేత బుద్ధ భాస్కర్, సచివాలయాల కన్వీనర్లు బుద్ధ పెంటారావు, గంటా సముద్రాలు, రేబాక మోహనకృష్ణవేణి, గృహ సారథులు, వలంటీర్లు, పార్టీ నేతలు, అభిమానులు పాల్గొన్నారు.
- సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలలో గత పాలకులత బేరీజు వేసుకుని, మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు ప్రజల్ని కోరారు. 82వ వార్డు పరిధి పాతబర్మాకాలనీలో శుక్రవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు తీరును వివరించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. వారి అనుమతితో ఇళ్లకు సీఎం జగన్ చిత్రంతో కూడిన, కార్యక్రమ స్టిక్కర్లను అతికించారు.
- 81వ వార్డు పరిధిలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ శిల పరశెట్టి బాబీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. ఇంటి యజమాని అంగీకారంతో మా నమ్మకం నువ్వే జగన్ పేరిట రూపొందించిన స్టిక్కర్లు అతికించారు.

కశింకోట : మండలంలోని ఉగ్గినపాలెం గ్రామంలో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సచివాలయ కన్వీనర్, సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి, కర పత్రాలను పంపిణీ చేశారు. మండలంలోని ఇతర గ్రామాల్లో కూడా కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.


- మండలంలోని తాళ్లపాలెం గ్రామంలో శుక్రవారం రాత్రి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. వారి స్పందనను తెలుసుకున్నారు. వారి ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను, కరపత్రాలను ప్రదర్శిస్తున్న బాబీ



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి, రమేష్ దంపతులు



పాతబర్మా కాలనీలో గృహిణితో మాట్లాడుతున్న జానకిరామరాజు

హనుమాన్ శోభా యాత్ర రేపు

అనకాపల్లిటౌన్ : ఈ నెల 9న జరప తలపెట్టిన హనుమాన్ శోభాయాత్రలో ప్రతి రామభక్తుడు పాల్గొని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా శోభాయాత్ర ప్రచారకుడు ఎం.జె.పి.కొండలరావు తెలిపారు. పట్టణంలోని గవరపాలెంలో శోభాయాత్రను పురస్కరించుకుని శుక్రవారం బైక్‌ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమాన్ శోభాయాత్ర పట్టణంలోని సుంకరమెట్ట జంక్షన్ నుంచి ప్రారంభమైన గవరపాలెం పార్కుసెంటర్, మెయిన్‌రోడ్డు, లక్ష్మీదేవిపేట, గాంధీనగర్, విజయరామరాజుపేట, నెహ్రూచౌక్ మీదుగా మండలంలోని కొత్తూరు పంచాయతీ పరిధి హనుమాన్ విగ్రహం వరకూ కొనసాగుతుందన్నారు.

10, 11 తేదీల్లో పైడిమాంబ పండగ

పరవాడ: మండలంలోని పెదముషిడివాడ గ్రామంలో కొలువుదీరిన పైడిమాంబ పండగను ఈ నెల 10, 11 తేదీల్లో వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ పల్లా అప్పారావు(కబడ్డీ) చెప్పారు. మంగళవారం వేకువ జాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. తొలి రోజు సోమవారం తొలేళ్లు పురస్కరించుకొని పులి వేషాలు, తప్పెటగుళ్లు, సేవ గరిడీ, నేల వేషాలు, చిడతలు, మేదర బండి, పూసల డ్యాన్సులు, బళ్ల వేషాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అమ్మవారి అనుపు మహోత్సవంలో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటలకు జిల్లా స్థాయి గుర్రపు స్వారీ పోటీలు ఏర్పాటు చేశారు. విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నారు. రాత్రికి తోడుపెద్దు గరిడి, మేదరబండి, పులివేషాలు, తప్పెడుగుళ్లు ఏర్పాటు చేశామన్నారు.

చురుగ్గా సీసీ రోడ్డు, కాలువ నిర్మాణం



కశింకోట పూసర్ల వీధిలో జరుగుతున్న సిమెంట్ రోడ్డు, కాలువ నిర్మాణ పనులు

కశింకోట : స్థానిక పూసర్ల వీధి ప్రాంతంలో రూ.30 లక్షలతో చేపట్టిన సిమెంట్ రోడ్డు, మురికి కాలువ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మంజూరు చేసిన నిధులతో పూసర్లవీధి రామాలయం నుంచి సంతబయల వరకు దీన్ని నిర్మిస్తున్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు పనులను శుక్రవారం పర్యవేక్షించారు.

పేదల పక్షపాతి సీఎం జగన్

- ఎన్నికల హామీలన్నీ నెరవేర్చాం
- ఆ ధైర్యంతోనే ఇంటింటికీ వస్తున్నాం
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి అమర్‌నాథ్



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను తల్లీకొడుకులకు అందిస్తున్న మంత్రి అమర్‌నాథ్



గుండాల కూడలి వద్ద గడప గడపకు మన ప్రభుత్వం ర్యాలీలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : పేదల పక్షపాతిగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని తుమ్మపాల పంచాయతీ గుండాల కూడలి వద్ద గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు, పురోగతిపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చామన్న ధైర్యంతో గడప గడపకు వస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలకు అర్హతే కొలమానమని పేర్కొన్నారు. పలు రాష్ట్రాలు సీఎం జగన్‌ను ఆదర్శంగా తీసుకుని సంక్షేమ పథకాల అమలుకు సిద్ధమవుతున్నట్టు తెలిపారు. నాలుగేళ్ల పాలనలో నవరత్నాల పేరిట సంక్షేమ పథకాలను 90 శాతానికిపైగా అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని గర్వంగా వెల్లడించారు. అంతకుముందు వెనుకబడిన తరగతుల బాలికల వసతిగృహంలో రూ.2.50 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. విద్యార్థినులతో కాసేపు ముచ్చటించారు. పక్కనే ఉన్న సచివాలయానికి వెళ్లి సమస్యలపై ఆరా తీశారు. సమస్యల పరిష్కారానికి అధికారులు శక్తివంచనలేకుండా పని చేసి ప్రభుత్వానికి పేరు తీసుకురావాలన్నారు. ప్రభుత్వ నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హతలుండీ, సాంకేతిక కారణాల పేరిట సంక్షేమ ఫలాలు దక్కనివారు మంత్రిని కలిసి వివరించగా, పరిష్కారమార్గాలను అన్వేషించాలని సచివాలయ అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ భీశెట్టి వరాహ సత్యవతి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి, సర్పంచ్‌లు తట్టా పెంటయ్యనాయుడు, వైస్ సర్పంచ్ చిన్నా, పార్టీ నేతలు పంచదార్ల కన్నారావు, వద్దాది అశోక్, పన్నీరు వెంకటలక్ష్మి, ఆడారి సూరిబాబు, పి.కోటేశ్వరరావు, ఎంపీటీసీలు, వార్డుమెంబర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పశు వైద్యశాలపై కలెక్టర్ ఆరా

- రూ.15 లక్షలు కావాలని నివేదించిన పశుసంవర్ధక శాఖ

సాక్షి ఎఫెక్ట్..



పశు వైద్యాధికారిణి చైతన్యమణి

కశింకోట : మండలంలోని నరసింగబిల్లిలో పశు వైద్య కేంద్ర భవన సమస్యపై ప్రచురించిన సాక్షి కథనానికి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి స్పందించారు. నిధుల లేమితో ఏళ్ల తరబడి భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిపోయింది. సామాజిక భవనంలో పశు వైద్య కేంద్రం నడుస్తున్న తీరుపై ఈ నెల 3న 'పశు వైద్యశాలకు వీడని గ్రహణం' శీర్షికన సాక్షి కథనాన్ని ప్రచురించిన సంగతి తెలిసిందే. ఈ కథనానికి కలెక్టర్ స్పందించి పూర్తి వివరాలు తనకు నివేదించాల్సిందిగా సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అసంపూర్తిగా నిలిచిన నిర్మాణం పూర్తికి, ఇంకా ప్లాస్టింగ్, ఫ్లోరింగ్, ప్రహరీ నిర్మాణం, విద్యుద్దీకరణ, టాయిలెట్లు తదితర పనులకు రూ.15 లక్షలు అవుతుందని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి ద్వారా కలెక్టర్‌కు నివేదించినట్టు నరసింగబిల్లి పశు వైద్యాధికారి చైతన్యమణి శుక్రవారం సాక్షికి తెలిపారు. నరసింగబిల్లిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రారంభించడానికి వచ్చిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను కలిసి పశువైద్య కేంద్ర భవన నిర్మాణం పూర్తి చేయాలని, పురుష సిబ్బందిని నియమించాలని విన్నవించగా సానుకూలంగా స్పందించినట్లు పాడి రైతు భీముని రమణ చెప్పారు. దీంతో పశు వైద్య కేంద్రం భవన నిర్మాణ సమస్య పరిష్కారం కాగలదని స్థానిక పాడి రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అవగాహనతోనే ఆరోగ్య సంరక్షణ



కశింకోట పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీ

కశింకోట : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆరోగ్య సంరక్షణపై వైద్య, ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి తిరుపతిరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు ప్రయత్నించాలన్నారు. సమతుల ఆహారం తీసుకోవడం, నిత్యం యోగా, ధ్యానం, నడక వంటివి చేయడం వల్ల మానసిక, శారీరక ప్రశాంతత కలుగుతుందన్నారు. ప్రతి రోజూ తృణ ధాన్యాలు, పండ్లు, కూరగాయలు ఆహారంలో భాగంగా చేసుకుంటే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. 45 ఏళ్లు దాటినవారు ఆరు మాసాలకోసారి బీపీ, సుగర్ పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే వీటితో బాధపడుతున్న వారు నెలకోసారి ఈ పరీక్షలు తప్పకుండా చేయించుకుని, రిపోర్టుల మేరకు వైద్యుల సూచనలు పాటిస్తూ, క్రమం తప్పకుండా మందులు వాడుతూ, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవోలు సీహెచ్ సత్యనారాయణ, మురళీకృష్ణ, రామమూర్తి, వైద్య సిబ్బంది సత్యవతి, మున్ని విజయలక్ష్మి, సుభాని, పారా మెడికల్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏసు మార్గాన పయనిద్దాం



మంత్రి అమర్‌నాథ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న జోసెఫ్



ఏసు వేషధారణలో శిలువ మోస్తున్న భక్తుడు



కశింకోట: గవరపేట చర్చిలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు

అనకాపల్లిటౌన్ : ప్రతి ఒక్కరూ ఏసుచూపిన శాంతి మార్గంలో పయనించాలని రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని స్థానిక ఆర్‌సీఎం చర్చిలో జరిగిన వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసు త్యాగాలను గుర్తు చేశారు. చర్చి ఫాదర్ పాల్ వద్ద ఆశీస్సులు పొందారు. అంతకుముందు మంత్రికి జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి జోసెఫ్ పుష్పగుచ్ఛం అందించారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు, రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు తదితరులు పాల్గొన్నారు.

– స్థానిక ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఏసుప్రభువు వేషధారణలో శిలువ మోస్తున్న దృశ్యం పట్టణవాసులను ఆకర్షించింది.

– తప్పు చేసిన వారిని కూడా రక్షించేది ఏసు మార్గమని ఉత్తరాంధ్ర నాగార్జున అభిమాన సంఘం అధ్యక్షుడు మళ్ల సురేంద్ర అన్నారు. స్థానిక జైలు ఆవరణలో గోల్డ్‌వాసు ఆర్థిక సాయంతో ఖైదీలకు, పండ్లు, డ్రింక్స్, టవళ్లు అందించారు. జైలు సూపరింటెండెంట్ ఎస్.గణేష్ రెడ్డి, అధికారులు వీరన్న బాబు, జగన్నాథరావు, ఉమామహేశ్వరరావు, అపోస్టొలిక్ చర్చ్ పాస్టర్ ఎస్.జె.ప్రకాష్ పాల్గొన్నారు.

కశింకోట : పురాతన ఆంధ్ర కల్వరి సెంటినరీ బాప్టిస్టు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శిలువ వేసినపుడు ఏసు ప్రవచించిన ఏడు సూక్తులను పాస్టర్ సన్నీ జేమ్స్ వినిపించారు. సర్పంచ్ మంత్రి జయరజని, మంత్రి పీటర్ వైజ్‌మెన్, హెచ్‌ఎం ఎం.ఎస్.స్వర్ణకుమారి, చర్చి కమిటీ అధ్యక్షుడు మోజెస్ పాల్గొన్నారు. గవరపేట, షాలేం మందిర్, హౌసింగ్ కాలనీ, సంతబయలలో కార్యక్రమాలు జరిగాయి.